నే నిక వినదలుచుకోలేదు.

ఎందుకంటే మా అమ్మ నా వద్ద ఆ విషయం ఎత్తటం ఈ రోజు కది పదో సారి. సాక్స్ తొడు క్కొంటూ మా అమ్మకేసి చూశాను విసుగ్గా. నా కళ్లలో కోపం ఆమె గ్రహించేలా ఒక్క క్షణం ఆమెపై చూపు నిలిపాను.

"అలా చూస్తావేరా, నే నేం కాని మాటన్నానురా?"

"అసలు పెళ్లి చేసుకోవటమే నా కిష్టం లేదు."

ఆమె జవాబుకు ఎదురు చూడకుండా తల వంచు కొని కాలు బూటులో దూర్చుకోసాగాను. మా అమ్మ అంత తేలిగ్గా విడిచిపెట్టదలుచుకోలేదు. నా కోపం పాల పొంగు లాటిదని, ఇన్ని నీళ్ళు చల్లితే ఓ క్షణంలో చల్లారిపోగలదని ఆమెకు సువిదితం. చిన్నతనంలో చందమామను చూపి గోరుముద్దలు తినిపించినంత తేలిగ్గా నా చేత పనులు చేయించగలననే గట్టి నమ్మకం ఆమెకు ఉంది.

"ఒరేయ్, ఇటు చూడు."

"ఊహూఁ."

"పెళ్లి చేసుకోపోతే మానె, చూసి రారా! చూసి నంతలోనే మన సొమ్మేం పోయింది?"

"చూడటం దేనికి చేసుకోనప్పుడు?"

"అసలు నిన్ను పెళ్లి చూపులకు రమ్మని వాళ్ళు అంటం లేదులేరా, నేనే అడుగుతున్నాను ఉండబట్టలేక. తెలిసిందా? నీవు కాలేజీలో చదువుతున్నావంటే, 'అప్పుడే అంతవాడయ్యాడా? బడికి పొమ్మంటే ఏడ్చే వాడు—ఒకసారి మా ఇంటికి పంపించండి, వదినగారూ' అని పదే పదే చెప్పింది మొన్న నాకు. నిన్ను చిన్నప్పుడు ఎత్తుకొని దించేది కాదు. ఒక అడుగు అటు వేసి రారా!"

"........."

"ఏం పిల్లాడివిరా! మాట్లాడవేరా? ఒరేయ్, ఇటు చూడు. ఆ విషయం కాదు లేరా!"

"ఏ విషయమైనా ఇప్పుడు వింటూ కూర్చో టానికి నాకు టైమ్‌లేదు." బూట్లు టకటక లాడించు కొంటూ మెట్లు దూకి బజార్లో పడ్డాను. మా అమ్మ చూపులు నన్ను వెన్నంటుతూనే ఉన్నాయి. షర్టు దులుపుకొని కాలర్ పైకెత్తుకొని సరిగా తొంభై డిగ్రీల కోణంలో చూసుకొంటూ నడిచాను. మలుపు తిరిగాను.

"శ్రీ రామా బెస్ట్ కిళ్లీ షాప్—ప్రొ. భద్రయ్య."

ప్రొ. భద్రయ్య భద్రంగా డబ్బా కొట్టులో కూర్చొని అతి నున్నితంగా తమలపాకులకు సున్నం రాస్తున్నాడు. నన్ను చూసి ఒక చిరునవ్వు నామీద ప్రయోగించాడు.

"ఇంకా కదుతూనే ఉన్నావా? సరిపోయింది. తొమ్మి దింటికి రెడీ చెయ్యమన్నానుగా. ముందొక సోడా ఇవ్వు." టైమ్ చూసుకొని కేకలు వేశాను. సోడా ఒకటి వరి వెత్త బుట్టలోనుండి అందుకొని గొంతు పిసికాడు. నేను జేబులో చెయ్యి పెట్టుకొన్నాను. చాకలి చవుడు. పబ్బులు లేవు. టేబిల్‌పై సోడాబుడ్డి వెలవెల పోసాగింది.

"సోడా కొట్టమని తాగకుండా పోతారేమిటండీ?" వెనకగా భద్రయ్య గొంతు అరుస్తూంది. హూటా హూటీని నాలుగు అంగల్లో మా అమ్మ సాన్నిధ్యంలో వాలాను. ఆమె వంటగదిలో పోపు దినుసులున్న డబ్బా మూత తీస్తూంది.



ప్రసిద్ధిచెందిన భారత్ వారి పేము కుర్చీలు
ప్రతి ఇంటా, ఆఫీసులో
తప్పక ఉండవలసినవి



శ్రీ జయభారతం అండ్ కం (రిజిష్టర్డు)
182, ఆర్. హెచ్. రోడ్డు, మద్రాసు—14.
ఉచిత కేటలాగుకు
మీ అడ్రసు స్పష్టముగా వ్రాయండి.




గౌర్ మోహన్ దాస్ అండ్ కం,
233, పాత చైనాబజార్ వీధి,
కలకత్తా—1
ఫోన్: 22—6580

2 బహుమతులు ఉచితం

అందమైన డిజైన్లలో, రంగులలో కాశ్మీర్ బ్యూటీ చీర రు. 7/— లకే పొందండి. (అసలు ధర రు. 9/—) 2 చీరెలు 13/— లు. డీలక్స్ క్వాలిటీ రు. 10/—లు, 2 చీరెలు రు. 19/— 3 చీరెలు రు. 27/— లు. స్పెషల్ క్వాలిటీ రు. 16/—లు. 2 చీరెలు రు. 30/— 3, చీరెలు రు. 43/— సూపర్ ఫైన్ క్వాలిటీ రు. 20/—లు. 2 చీరెలు రు. 38/—లు. 3 చీరెలు 55/—లు. ఒక పార్సెలులో ఏ రెండు చీరెలతోగాని ఒక బ్లౌజు ముక్క, ఒక జత చెవి తమ్మలు (ear tops) ఉచితం. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.



THE ROYAL STORES
(SAREES DEPTT. APWA)
Post Box No. 1774, Delhi-6

# రాజు - రాణి

"అమ్మా!"

". . . . ."

"అమ్మా!"

ఆమెకు ఎదురుగా నిలబడ్డాను పనికి ఆటంకం కలిగిస్తూ.

"చెప్పు." తీవ్రంగా అంది పక్కకు చూస్తూ.

"దేవికమ్మా? తేలు కనిపించిందా, ఏమే? ఎక్కడ? చూపించు."

ఆమె కోపం అలా కళాయిలో డాల్డాలా కరిగిపోయి పక్కున నవ్వింది.

"ఈ వేళ మే మందరమూ పిక్‌నిక్‌కి వెళుతున్నామే. కిళ్లీలు, బిస్కట్ల ఖర్చు నాదని లాటరీ చీటీ వచ్చింది. ఒక పది రూపాయలు ఇవ్వు. రాత్రి చెబుదామంటే నాన్న ఉన్నాడని చెప్పలే." కాలరు సరిగా వాల్చుకొని ఆమె పట్ల ఎనలేని భక్తి శ్రద్ధలు ఒలకపోశాను.

"ఇవ్వనుపో."తిరుగులేని నిశ్చయం ప్రతిధ్వనించింది.

"అమ్మా, శేషమ్మగారింటికి వెళ్లొస్తా లేవే."

"ఏం అవసరం లేదు. నీకు డబ్బులు కావాలంటే అమ్మనా? అందరూ నీలాటి కొడుకులయితే ఏం సుఖపడతార్రా ఈ లోకంలో? 'ఆమె చూడాలని సంబర పడుతూంది. ఒక్కసారి ముఖం చూపెట్టి రారా' అని నెత్తిని నోరు పెట్టుకొని చెబితే ఆవగింజంతయినా లెక్కలేదు. డబ్బు కావాలంటే 'అమ్మా' అంటూ నంగనాచిలా దగ్గిరికి చేరతావు. ఇవ్వను పో. అయినా నా దగ్గిర డబ్బెక్కడిది? నే నేమన్నా సంపాదించేదాన్నా? తీర్చేదాన్నా? మీ నాన్ననే అడుగు."

పరిశీలించిన ఆ పోపుగింజలు కాగుతున్న నూనెలో పడవేసి గరిటె అందుకొంది.

"అమ్మా! పిక్‌నిక్‌కి వెళ్లి వచ్చాక వెడతానులేవే. డబ్బులిచ్చెయ్యి."

"నిన్న సాయంత్రం పంపిస్తానని చెప్పా. నిన్నంతా ఎదురు చూసి ఉంటారు. బుద్ధిగా మాట వినే కొడుకని వాళ్లకి మాట ఇవ్వటం నా బుద్ధి తక్కువ. నీ కేంరా?"

"సాయంత్రం వెళతాలేవే. ముందు డబ్బులిచ్చెయ్."

"ఇవ్వన్రా, ఏం నీ మాటే మాటా? నీవు పోతే వాకేం, పోకపోతే నా కేం?" గరిటె కళాయిలో తిప్పుతూ ఖండితంగా చెప్పింది.

"సరే, ఒక రూపాయి ఇవ్వు. ఇప్పుడే వాళ్లింటికి వెళ్లొస్తా." కళాయిలో చిటచిట లాడిన నూనె ప్రశాంతత వహించింది. ఆమె పెదవులపై వెలిగిన చిరునవ్వు నాకు కనిపించనియ్యకుండా అటు తిరిగింది.

తల ఎత్తకుండా బొడ్లో దోపుకున్న నలిగిపోయిన ఒక రూపాయి నోటు నా చేతిలో పెట్టింది. మరోకసారి అద్దం ముందు నిలబడి బుగ్గలపై పౌడరు అద్ది తల సరిదిద్దుకొని నొసటిపై వెంట్రుకలు పడేలా కొద్దిగా చెరుపు కున్నాను. సైకిల్ ఎక్కి సునాయాసంగా ట్రాఫిక్ తప్పుకొంటూ పది నిమిషాల్లో మా అమ్మ నిర్దేశించిన మేడ ముందు ఆగాను.

గేటు తీసి లోనికి వెళ్లాను. అతిథుల కొరకు ఎదురు చూస్తున్న నాలుగు పేము కుర్చీలు వరండాలో దిగాలు పడి ఉన్నాయి. శరీరాన్ని మెల్లెక్కించి ఒక కుర్చీలో దింపాను. పరదా తొలగించి ఓ వయస్సు మళ్లినావిడ ప్రత్యక్షమైంది.

చీరె ఖరీదయినది కాదు గానీ శుభ్రంగా ఉంది. చామనచాయ అని కించపరచలేని ఎరుపు రంగు. వయస్సు ముప్ఫయి దాటినా పట్టు సడలని శరీరం. కొప్పు పెట్టుకొని హుందాగా ఉంది.

"ఎవరు కావాలి మీకు?"

నేను లేచి వినయంగా నమస్కరించాను రెండు చేతులూ జోడించి. పెల్లుబికి వస్తూన్న నవ్వును ఆమె దాచుకోటానికి చేసిన ప్రయత్నంలో తమలపాకులు నమలటంలో ఉన్న అనుభవం కొన్ని దశాబ్దాల తరబడి దనే విషయం ధ్రువపడిపోయింది.

"నే నండీ, నేను జానకమ్మగా రబ్బాయిని. మా అమ్మ..." బొత్తాం సరిదిద్దుకొంటూ అన్నాను.

"ఓహో, అలానా! ఇప్పుడే పిలుస్తాను ఉండండి అమ్మగారిని." రెండడుగులు లోనికి వేసి మళ్లీ వెనక్కి వచ్చింది.

"అలా నిలబడి పోయారేం? కూర్చోండి, బాబుగారూ. నిన్నంతా ఎదురుచూశారు మీరు వస్తారని. అమ్మగారిని పంపిస్తా. కూర్చోండి."

పనిమనుషులు ఇలా ఉంటారని నిర్మితమైన అలంకరణ, ఆకారం రూపొందించుకొన్నందుకు నన్ను నేనే నిందించుకొని కుర్చీలో కూర్చున్నాను, వెంటనే లేచేందుకు వీలుగా. ఇక ప్రత్యక్షం కాబోయే ఆవిడేగా ఇంటర్వ్యూ ఆఫీసర్!

అయిదు నిమిషాలు గడిచాయి.

ఇంకొక స్త్రీ దర్శనం ఇచ్చింది. నమస్కారం చెయ్యటానికి ఉపక్రమించిన చేతులు సగంలోనే కార్యక్రమం విరమించుకొన్నాయి. ఇక లేవటం మరిచిపోలేదు గానీ అంత అవసర మనిపించలేదు.

చౌకరకం నేతచీరె. ముఖాన రూపాయంత కుంకుమ బొట్టు. స్నానం చేసి తల వెంట్రుకలు జారుముడి వేసుకొంది. సన్నగా ఈసురోమంటూ ఉంది. చీరె చెరుగు బుజం మీదుగా నిండుగా కప్పుకొని గోడ కానుకొని నిలబడి నా కేసి పరీక్షగా ఓ క్షణం చూసింది.

"మీ అమ్మగారు ఇంకెంత సేపటికి వస్తా"రని అడగాలనుకొన్నాను. నాలుక చివరి వరకూ వచ్చాయి మాటలు. అంతలో ఆమె మాట్లాడించింది.

"ఎంతవాడి వయ్యావ్, నాయనా! నేను గుర్తుపట్టలేక పోయాను. మీ అమ్మ చెప్పింది. కానీ, నిన్ను అయిదేళ్ళ పిల్లవాడప్పుడు చూశా. కూర్చో, నాయనా!" అంది.

లాంఛనప్రాయంగా నమస్తే చెప్పనందుకు ఎంతో బాధ పడ్డాను. ఇప్పుడు చెబితే? అబ్బే, ఇప్పుడు బాగుండదు. అరే, ఎంత పొరపాటు! నాలుక కరుచుకొని నిస్సహాయంగా నిలబడిపోయాను.

"ఏమిటో, నాయనా, ఈ సర్కారు ఉద్యోగాలు? పిల్లిపిల్లల్ని తిప్పినట్లు తిప్పుతారు. మళ్లీ మీరు మావూరు వస్తారని కలలోకూడా అనుకోలేదు."

"అమ్మా, నా రిబ్బన్లు నీవు చూశావా?" కోమల కంఠం మాట్లాడుతూ వరండాలోకి వచ్చింది బాణంలా. దోరవయస్సులో ఉన్న అమ్మాయి. ఎర్రని పెదవులు దగ్గిరగా తీసుకొని మూతి ముడుచుకొని, కళ్ళు

జన్మలో పెళ్ళి చేసుకోకూడదని భీష్మించు కొన్న వ్యక్తులు కూడా ఒకానొక శుభ ముహూర్తంలో మూడు ముళ్ళూ వేయడానికి క్షణం అనుమానించరు. ప్రేమించారా అంటే అందుకు తగిన సావకాశం కాని, అనుకూల మైన వాతావరణం కాని ఉండదు. మరి ఈ మార్పు ఎలా వస్తుంది? హోటల్ భోజనం కిట్టక. కనకనే మగవాడి మనసుకు మార్గం పొట్ట అన్నారు. ఇంకా ఎన్నో కారణాలు.

---

గుండ్రంగా తిప్పుకుంటూ మెరుపులా మాయమైంది నన్ను చూసి.

"పరాయివాడు టే అలా వెళ్ళటానికి? రామ్మా, ఫర్వాలేదు" అని లోనికి చూస్తూ పలికి మళ్ళీ నా కేసి తిరిగింది. "మా అమ్మాయి, నాయనా! నీ వెప్పుడూ చూడలేదుకదూ! కాన్వెంటులో పది చదువుతూంది. అన్నీ ఇంగ్లీషులోనేనట. దాని ఫీజులకూ బట్టలకూ ఇప్పుడే బోలెడంత డబ్బు. ఇక నీకులా కాలేజీలో చదివితే మేము అసలు తట్టుకోలేం. అయ్యో, నా మతిమరుపు మండా! నీకు కాఫీ అయినా ఇవ్వకుండా మాట్లాడుతున్నాను."

"అబ్బె, వద్దండీ. నే నిప్పుడే తాగాను."

"తాగితే నేం? మళ్ళీ తాగు. రాజా, రాజా" అని కేకలు వేసుకొంటూ లోనికి వెళ్ళింది.

రాజా!

రా జెవ్వడు?

వాళ్ళకు మగపిల్లలు లేరని మా అమ్మ చెప్పినట్లు నాకు బాగా జ్ఞాపకం. జ్ఞాపకం లేకపోవటానికి ఒకసారా! రెండు సార్లా! దాదాపు ఓ వెయ్యి సార్లయినా కనీసం చెప్పి ఉంటుంది.

"వాళ్లకు ఒక్కగా నొక్క కూతురు. ఆ మేడ, కంట్రాక్టులమీద ఆయన సంపాదించిన ఆస్తి అంతా దాన్ని కట్టుకొన్నవాడికే. లేకపోతే ఆయన కట్టుకు పోతాడా? కట్నం ఎంత ఇస్తారని మనం ఇప్పుడే బేరా నికి దిగితే వాళ్లు నొచ్చుకుంటారు. అనవసరంగా మన బుద్ధి బయట వేసుకొన్నవాళ్ళమై పోతాం. మన కంటే ఉన్న సంబంధం ఆ పిల్లకు తేలేక కాదు. వీడంటే ఆమెకు చిన్నప్పటినుండి మా ఇది" అని మా అమ్మ మా నాన్నకు కంచం ముందు పెట్టి ఆయన చేతులు కడుక్కునే వరకూ ఒకే వరసలో తిరిగే పాత గ్రామ ఫోను రికార్డులా పాడటం ఈ మధ్య పది రోజులనుండి మాకు నిత్యం అనుభవం.

అయితే మరి ఈ రాజాగా డెవ్వడు? ఎవరినైనా దత్తు తీసుకొన్నారేమో, ఆస్తి అంతా ఇంటి పేరు నిలుపని ఆ అల్లుడుగాడికి తగలపెట్టట మెందుకని!

ఏమో, నమ్మం దెవడు?

అందుకనే కాబోలు కట్నం ప్రసక్తి అమ్మ తెచ్చి నప్పుడల్లా "ఆలోచిద్దాం, ఆలోచిద్దా"మని పితృదేవులు సంక్షిప్తసమాధానా లిచ్చేది. వారి బుద్ధి సూక్ష్మతకు జోహారు లర్పించాలి.

మంచినీళ్ళ గ్లాసు, రెండులడ్లు, బిస్కట్లు ఉన్న సాసరు తెచ్చిపెట్టింది ఆ గృహిణి. నేను టైమ్ చూసుకొన్నాను.

## తాడిగిరి పోతరాజు



గబగబా ఆ రెండు లడ్లు నోట్లో కుక్కుకో సాగాను. ఎదురుగా ఆమె నా చిన్నతనంలో నేను చేసిన అల్లరివి గూర్చి స్వగతంగా చెప్పుకు పోసాగింది.

మంచినీళ్ళతో గొంతు సరాళం చేసి బిస్కట్లు అందు కొన్నాను, టైమ్ చూసుకొంటూ.

"అంత తొందర పనుందా, నాయనా?"

"లేదండీ." మెల్లిగా, నాజూగ్గా బిస్కట్లకు నొప్పి తగలకుండా తినసాగాను.

"అమ్మా!" ఇందాకటి సన్నని కంఠం మళ్ళీ విని పించింది. రెండు చేతులు కాఫీకప్పుతో తెర ఇవతలగా కనిపించాయి. అర్ధముఖాకృతి. అయ్యో!

సిగ్గు ముంచుకువచ్చి కిసుక్కున ఓ నవ్వు పారేసి తలుపుచాటుకు పోయింది.

"రావే." ఆమె పిలిచింది.

ఆ చేతులు మరింత తలుపుచాటుకు పోయాయి.

"ఏం పిల్లవే ఇంత సిగ్గయితే ఎలా?" అంటూ పొగలు కక్కుతూన్న కప్పు సాసరు అందుకొని టీ పాయిమీద పెట్టింది.

"అమ్మా, రాణి మేడమీదికి వెళ్ళింది పిలు అమ్మా." తల్లి పలికింది.

రాణీ, రాణి ఎవరు? అయినా రాణి ఎందుకు? ఆయితే ఇప్పుడు వచ్చిన వన్నెల విసనకర్ర అసలు శాల్తీ కాదన్నమాట! చచ్చాం. కానీ ఒక్కర్తే కూతురని గదా అమ్మ చెప్పింది. అమ్మ చెప్పట మేం ఖర్మ? ఇప్పుడేగా ఒక్క నిమిషం క్రితం, మా పుత్రికా రత్నమని పరిచయం చేసింది.

"అదే వస్తుందిలే." ఆ అమ్మాయి తలుపు చాటు నుండి సమాధానం.

అయితే రాణి రావాలన్నమాట! నాన్సెన్స్! ఎంత పొరపాటు! అసలు మనకు చూపదలచు కొన్న శాల్తీ ఈ రాణీ అన్నమాట! లేకపోతే 'రాణిని పిలుచుకు రామ్మా' అని ఈ అమ్మాయితో ఎందుకు చెబుతుంది? మరి ఈ అమ్మాయి ఎవరు? స్వంత కూతురు కాదా? ఏమో ఆ గొడవ. మన కెందుకు? మనం చూడవలిసింది రాణిని. అయినా ఇంకా రాదేమిటి?

"అయితే, బాబూ, ఇది పాసయ్యాక ఇంకా చదువు తావా?"

"అవునండీ."

అబ్బ! ఏం ముచ్చట్లు ఈమెకు మనతో, వెళ్ళి ఆ రాణిని పిలుచుకు రాక. రాణి. రాణి ఎంచక్కటి పేరు. పేరుకు తగ్గట్టు అందంగా కూడా ఉండచ్చు. సున్నితంగా చీర కుచ్చెళ్ళు కొద్దిగా పైకెత్తుకొని, మెలి గా అడుగులో అడుగు వేస్తూ అప్సరసలా దిగుతుంది. తన ముందు సరిగా నడవటం కుదరక తూనీగలా తుర్రున లోనికి పరిగెత్తుతుంది.

"రాణీ, రాణీ." నాకు కుడివైపుగా ఉన్న మెట్ల కేసి నడిచి ఆమె గొంతెత్తి పిలిచింది.

మనసు ఉండబట్టలేక నేనూ ఆ మెట్ల వైపు చూశాను ఓరకంటితో. ఏ క్షణంలో ఆ దేవత మెట్లు దిగి వస్తుందోనని కనురెప్ప వెయ్యకుండా, అత్యంత జాగరూకతతో కూర్చున్నాను. కానీ ఎంత సేపటికీ దిగి రాదే! నిరాశతో కూడిన నిట్టూర్పు విడిచాను ఎందుకు రాలేదు? బహుశా నే నిక్కడ ఉండటం గమ నించి రావటానికి సిగ్గు పడి ఉంటుంది. ఇంకా రాదేమిటి?


## చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులకు పోస్టులో ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ప్రతులు ప్రస్తుతం మద్రాసునుంచే పంపుతున్నామని ప్రకటించడానికి ఆనందిస్తున్నాము. పోస్టుద్వారా ప్రతులు పొందగోరే పాఠకులు, చందాదారులు తమ చందా మొత్తాలను లోగడవలె విజయవాడకుకాక ఈ దిగువ చిరునామాకు పంపాలని కోరుతున్నాము.

సర్క్యులేషన్ మానేజరు
ఆంధ్రప్రభ లిమిటెడ్
డైరెక్టర్స్ ఆఫీసు
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మౌంట్‌రోడ్
మద్రాసు 2

### చందా వివరాలు

| | |
|---|---|
| మూడు నెలలకు: | రు. పై. |
| ఏజెంట్లద్వారా | 4—55 |
| పోస్టుద్వారా | 4—99 |
| ఆరు నెలలకు: | |
| ఏజెంట్లద్వారా | 9—10 |
| పోస్టుద్వారా | 9—88 |
| సంవత్సరానికి: | |
| ఏజెంట్లద్వారా | 18—20 |
| పోస్టుద్వారా | 19—76 |

**ఉచితం! ఉచితం!! ఉచితం!!!**



పారిస్ బ్యూటీ శాలువలు, పూర్తిసైజువి, అందమైన డిజైన్లు, రంగులు, 1 శాలువ రు. 7—50, 2 రు. 14—00, 3 రు. 19—50. స్పెషల్ క్వాలిటీ 1 శాలువ రు. 10—00, 2 రు. 19—00, 3 రు. 27—00, సూపర్ క్వాలిటీ 1 శాలువ రు. 12—00, 2 రు. 22—00, 3 రు. 30—00. చిన్న పిల్లల సైజు 1 రు. 6—00, 2 రు. 11—00, 3 రు. 15—00, ఒక పార్సెలులో 2 లేక ఎక్కువ శాలువలు తెప్పించు కొనువారికి ఒక అందమైన స్త్రీల పర్సు ఉచితం. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుచు నేడే ఆర్డరు ఇవ్వండి

**Paris Commercial Co. (APRW), Post Box No. 1804, Delhi-6.**



# పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నదీ, మీ సరియైన చర్యను గురించీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామానూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1–25 పైకము మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేమైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**

# పెద్దలకు మాత్రమే!!

## దాంపత్య జీవితంలోని బలహీనత గూర్చి మీరు చింతపడవద్దు

# జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేద టానిక్, ఉత్తమ గుణములు కలది. కోల్పోయిన శక్తిని చేకూర్చి మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన, యవ్వనవతులుగా ఉందురు.

**ఎక్కువ ఫలితానికి:**

పాలు వాడటం మంచిది—కావలసినంత దేహవ్యాయామం చేయవలెను—గ్రుడ్లు వాడరాదు.

**ముఖ్య గమనిక:** జీవనస్పెషల్ మీదేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది కాబట్టి మూడు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట చాలా అవసరం. లేనియెడల లావై పోదురు లేక దాంపత్య వాంఛ అధిక మగును **ఆరోగ్యం బలంచేకూరిన వెంటనే మాని వేయవలెను.** 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును ధర రు. 10/—ప్యాకింగు, పోస్టేజి అదనం.

మేము క్రొత్తగా ప్రవేశపెట్టినది - **"అమృతలేపనం"**

"జీవన స్పెషల్"కు తోడు విక్రయించబడునది. 25 గ్రా. మీ సీసా 1కి రు 10/—లు నికరం. చిరునామాలు తెలుగులో వ్రాయండి. పగం విలువ అడ్వాన్సుగా ఆర్డరుతో పంపవలెను మిగిలినది వి. పి. ద్వారా చెల్లించవలెను. ఆర్డర్లు దిగువ అడ్రసుకు పంపవలెను. ఉత్తరములన్నియు ఇంగ్లీషులోనే వ్రాయవలెను.

**Manager, Jeevamritham Oushada Sala,**
**CALICUT-1, (S. INDIA)**

*Chief Physician: Dr. K N. RAMDAS.* *Phone 3607 & 2419*

**షరా:** ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో పనిచేయుటకు అన్ని టౌన్లలో సాకిస్టులు కావలెను. షరతు నిబంధనలకు వ్రాయండి

# రాజు - రాణి

తొలి చూపుల్లోనే ఆకర్షించబడాలని చక్కగా ముస్తాబు చేసకొంటూంది కాబోలు! అయినా ఇంకెంత సేపు?

"కాఫీ తాగు, నాయనా! చల్లారి పోతున్నది."

"ఆ. అవును. కాఫీ." కప్పు పెదవులపై ఆన్చుకొన్నాను.

"నిన్న సాయంత్రం రాకూడదా, బాబూ? వారు కూడా చూసేవారు నిన్ను."

ముసలిపీనుగ పొద్దుగూకులూ అదొకటి, ఇదొకటి నన్నుగూర్చే మాట్లాడుతుంది గానీ ఆ రాణిని మరోసారి కేక వెయ్యకూడదూ? అయినా ఆ రాణి కెంత గర్వం! వచ్చి ఇరవై నిమిషాలయినా మేడ దిగి రాలేదు. నాన్సెన్స్. ఎంత అందగత్తె అయినా ఇంత అహంకారమా? అసలింతకూ వీళ్ళు నన్ను చూడటానికి పిలిచినట్టుంది వాలకం చూస్తే. 'వారు కూడ చూసేవారు నిన్ను' అంటే అదేగా అర్థం. పిల్లను చూపించటానికి కాదన్నమాట ఇన్సల్ట్.

"అవునండీ. నిన్న మా అమ్మ చెప్పింది కానీ కాలేజీలో ఫంక్షన్ ఉండి రాలేకపోయాను."

పిక్‌నిక్‌పార్టీ ముళ్ళు మా ఇంటిచుట్టూ పహరా తిరుగుతూంటుందీపాటికి. టైమెంతయింది? అయ్యబాబోయ్! పది దాటిపోయింది, గడియారం చూసుకొని తల పైకెత్తాను

"అంత తొందర పనులుంటే వెళ్ళిరా, నాయనా, పాపం"

గ్లాసు మంచినీళ్ళు ఖాళీ చేశాను

హా దుర్విధీ! ఎంత అవమానం! అమ్మాయిని చూపించకుండా పంపించటమే కాక మనకు తొందర పనుందని నెపం నెత్తిపై రుద్ది మరీ సాగనంపుతూంది. ఈలాటివాళ్ళు ఎంతకయినా సమర్థులు. వెళ్ళమన్నాక ఇంకా ఉంటే — ఛ.

"నమస్తే." లేచి వాహనాన్ని సమీపించాను.

"సాయంత్రం అమ్మను ఓమారు రమ్మని చెప్పు, బాబూ."

"అలాగే చెబుతాలెండి." సైకిలెక్కాను.

ఇప్పుడా రాణి మెట్లపైనుండి మనల్ని చూడచ్చు. ఇందాకటి పుత్తడి బొమ్మ తలుపుచాటునుండి ఈవలికి వచ్చి నిర్భయంగా వీక్షించవచ్చు. పచ్చి దొంగలు. వీళ్ళు నన్ను ఎన్నుకొంటానికే పిలిచి ఉంటారు. పైగా సాయంత్రం అమ్మను పంపించాలిట. ఎంత మర్యాద! ఈలాటివాళ్ళు ఎంతకయినా సమర్థులు. 'నీకు కాక ఎవరికి నాయనా ఈ ఆస్తి అంతా?' అంటూనే అల్లుడి నెత్తిన శరకోపం పెడతారు.

ఇంతకూ ఆ రాజుగాడెవడు? రాజా అని ముద్దుగా పిలుస్తూంది వాడెవడో బయటికి వస్తే తేలిపోవును!

రాజు — రాణి. వహ్వా!

రాణీట, పెద్ద క్వీన్ ఎలిజబెత్‌లా! ఎప్పుడైనా కనిపించాలి చెబుతా. ఇంతకీ ఈలాటివాళ్ళ మాటలు నమ్మి మోసపోయి, నన్నీ పెళ్ళిచూపులకు పంపిన మా అమ్మను

అటు వాలి. మెల్లెగా ఇంటికిపోయాక. 'వాళ్ళింటికి పోయి రారా! పోయిరారా.' ఒకటే గోల ఆలిండియా రేడియో నిలయవిద్వాంసుల గోష్ఠిలా.

సైకిల్ దిగి వరండాలో పెట్టేసరికి చెమటలు కారిపోయాయి. బట్టలు నలిగిపోయాయి. ఇంత శ్రమ చేసినా రాణిని చూడలేకపోయిన బాధతో గుండె మండుకుపోయింది.

"అమ్మా, అమ్మా, అమ్మా!"

"ఏమిట్రా. . . ఇల్లెగిరిపొయ్యేలా గావుకేకలు. అప్పుడే వచ్చావేం? శేషమ్మగా రేమన్నారు?" ఆవిడ కళ్ళలో ఆనందంతో బాటు సంతృప్తి తొణికిసలాడుతూంది. పుత్రుడెంత అవమానానికి గురిఅయ్యాడో ఆమెకు తెలుసా?

"అమ్మా, ఇన్‌సల్ట్. గ్రేట్ ఇన్‌సల్ట్. నేను ఆ పిల్లను పచ్చినా చేసుకోను."

"మెల్లిగా మాట్లాడరా. అసలేం జరిగిందిరా?"

"నీ వెన్నయినా చెప్పమ్మా. అంత గర్వమున్న పిల్ల మన ఇంటికోడలుగా, కాదు — నీ కోడలుగా తగదు. ఇదిమాత్రం సత్యం. ముందు పది రూపాయలివ్వు — వాళ్ళు వచ్చే వేళయింది."

"ఇస్తాలేరా. సాంతం చెప్పు."

"చెప్పటానికేముంది? వాళ్ళమ్మ, అవాళ్ళమ్మ, అంత చెడ్డది కాదులే. పోగానే కాఫీ అదీ ఇచ్చి మర్యాదగానే చూసింది.కానీ ఆ పిల్ల ఎంత పిలిచినా మేడదిగి రాలేదు. అంత టెక్కుకొడుతుందనే నేను పోనంటే పోనన్నాను. తిక్క కుదిర్చారు. ఇన్‌సల్ట్."

"ఎవ్రరా?"

"ఇంకెవరు? శేషమ్మగారమ్మాయి. గారాబాలపట్టి."

"పాపం, పిచ్చిపిల్ల సిగ్గుపడి ఉంటుంది లేరా! అయినా రాజాకంత పెంకితనం లేదే? నే నెప్పుడు వెళ్ళినా నీగూర్చి ఎంతో ఇదిగా అడుగుతుంది."

"రాజాంటే?"

"అదేరా. . రాజేశ్వరి. వాళ్ళకు మగపిల్లలు లేకపోవటాన అదే వాళ్ళకు కొడుకు. అందుకనే 'రాజా' అని ముద్దుగా పిలుచుకుంటారు. వాళ్ళ నాన్న మరీనూ. 'ఓరేయ్ రాజా' అంటారు."

"మరి రాణి?"

"రాణా?" ఆమె నవ్వుతూ మాట్లాడింది. "రాజా పెంచుకొనే సీమకుక్కపిల్ల. తెల్లగా అందంగా ముచ్చటగా ఉంది కదూ? కాని ఆడకుక్కపిల్ల. అందుకని దాన్ని రాణి అని పిలుస్తారు."

వీధిలో విద్యార్థుల గుంపొకటి కోలాహలంగా ఆగింది మా గేటు ముందు. చంకలో వేలాడుతున్న ఫ్లాస్కులు, కెమెరాలు, తలలమీద టోపీలు, ముక్కులపై కెక్కిన నల్ల కళ్ళద్దాలు. . "ఒరేయ్, అలానే కూర్చున్నావేరా, ఆముదం తాగిన ముఖం పెట్టుకొని?" కేకలు.

"అమ్మా, పది రూపాయలు." చెయ్యి చాపాను.

"అయిదు చాలవురా?" అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది.

నే నిక వినదలుచుకోలేదు! ★


ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# ప్లవంగ ఉగాది నవలల పోటీ

# 7,500 రూ. బహుమతులు

ప్రతి ఏడాదివలెనే ప్లవంగ ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలలపోటీ నిర్వహిస్తున్నది. పరాభవ ఉగాది నవలల పోటీకి 5 500 రూపాయల బహుమతులు ఇచ్చాము రచయితలను ఇతోధికంగా ప్రోత్సహించే లక్ష్యంతో ప్లవంగ ఉగాది నవలల పోటీకి 7,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన నవలలు అందజేయాలనే మా సంకల్పం సఫలం కావడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

మొదటి బహుమతి **4,000**
రెండవ బహుమతి **2,000**
మూడవ బహుమతి **1,500**

**పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి:**

1. రచన 250 పావు తావు కాగితాలకు మించరాదు. 2. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి. 3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి 4. స్వీయ రచనలేకాని అనువాదాలు పంపరాదు, 5. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి. 6 బహుమతులు పొందని రచనలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది. 7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కాని వాటిని తిప్పిపంపే నిమిత్తం తగుమాత్రం తపాల బిళ్ళలు అంటించిన, చిరునామా ఉన్న కవరు జతపరచి పంపవలసి ఉంది. లేకపోతే వాటిని తిప్పి పంపడం జరగదు. 8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు–2'కు పంపాలి. 9. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపే వీడవు.

బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది

ప్లవంగ ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | **1967 జనవరి 31**